క్లుప్తంగా

నేడు సుందరాకాండ పారాయణం

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సుందరాకాండ పారాయణం జరుగుతుందని దేవస్థానం చైర్మన్ గురునాథరావు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి రజనీకుమారి మాట్లాడుతూ దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా 108 రాష్ట్రాల్లో భాగంగా మన ప్రకాశం జిల్లాలో మన దేవస్థానంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు.

10న చిత్రలేఖన పోటీలు

ఒంగోలు: బాలల దినోత్సవం పురస్కరించుకుని నవంబరు 10న స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ట్రస్టు చిత్రలేఖన పోటీల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పోటీలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఒక కో కన్వీనర్, 18 మంది సభ్యులతో కమిటీ వేశారు. సబ్ జూనియర్స్(2–4 తరగతులు), జూనియర్స్ (5–7 తరగతులు), సీనియర్స్ (8–10 తరగతులు)గా పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. సబ్ జూనియర్స్‌కు ప్రకృతి దృశ్యం, జూనియర్స్‌కు పల్లె జీవనం, సీనియర్స్‌కు పర్యావరణ పరిరక్షణకై మన బాధ్యత అనే అంశాలపై పోటీలు ఉంటాయని కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం అనంతరం మీడియాకు తెలిపారు. ప్రాథశాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి ఏ విభాగానికి ఎంత మంది విద్యార్థులు హాజరయ్యేది 94903 00438 లేదా 94903 00441 నంబర్లకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా భరద్వాజ మాస్టర్ జయంతి



భరద్వాజ మాస్టర్‌కు పూజలు చేస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్ పేట షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం పూజ్య శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టారు 85వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు ఆలయ అర్చక స్వాములు పూజ గురువు ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ సమాధి అభిషేకం అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ విగ్రహాన్ని మేళ తాళాలతో సంకీర్తనతో ఊరేగించి దత్త మందిరం ముందు వేదికను చక్కని వివిధ రకాల పుష్పాలతో పూలతో అలంకరించి గురు పూజలు చేశారు. భరద్వాజ మాస్టర్ శిష్యులు భక్త బృందం, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ నిలిపివేయాలి

ఒంగోలు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దారుల విధ్వంసాన్ని తక్షణమే ఆపాలని ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ రఫీ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి స్థానిక పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. 20 రోజులకుపైగా ఇజ్రాయిల్ దురాక్రమణదారులు పాలస్తీనాపై చేస్తున్న మిస్సైల్ దాడుల్లో వేలాదిమంది పాలస్తీనీయులు మరణించారని విచారం వ్యక్తం చేశారు. అందులో రెండు వేల మందికిపైగా చిన్నారులు, మహిళలు ఉన్నారన్నారు. ప్రపంచం మొత్తం ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తుంటే అమెరికాలాంటి సామ్రాజ్య వాదుల ప్రోద్బలంతో జరుగుతున్న ఈ మానవ హననపు చిత్రాలు మనసున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయన్నారు. ముస్లిం సామాజిక కార్యకర్త పఠాన్ కరిముల్లా ఖాన్, షేక్ జిలానీ, పఠాన్ సర్దార్ ఖాన్, షేక్ రజాక్, పఠాన్ రహమాన్ ఖాన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ల్యాబ్స్ పరిశీలన



హెచ్ నిడమనూరు స్కూల్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని పలు పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్, సైన్స్ ల్యాబ్స్ పనితీరును టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం పరిశీలించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలంలోని హెచ్ నిడమానూరు, మేదరమెట్ల, ఇండియన్ బ్లూమ్స్ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లలో నిర్వహించిన రోబోటిక్ వర్క్‌షాప్‌లో తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్స్ పూర్‌మెన్ బ్లెండ్ స్టిక్, సర్వింగ్ రోబో, ఆటో మేటిక్ స్ట్రీట్ లైట్స్, స్మార్ట్ డస్ట్ బిన్‌లను పరిశీలించారు. విద్యార్థులను అభినందించారు. ఆయా పాఠశాలల్లో స్టాక్ రిజిస్టర్స్, యుటిలైజేషన్ సర్టిఫికెట్స్, నెలవారీ డాష్ బోర్డు రిపోర్టులను పరిశీలించి తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ జీఆర్ భాగ్యశ్రీ, సైన్స్ ఆఫీసర్ టీ రమేష్, సైన్స్ ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఏటీఎల్ ఇన్‌చార్జి పీవీ రమణయ్య, పోతురాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా



కిట్లు అందజేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, నాగజ్యోతి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణమ్మ

ఒంగోలు టౌన్: జగనన్న సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్య భరోసా లభిస్తోందని నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత అన్నారు. నగరంలోని సీఆర్పీ క్వార్టర్స్ డౌన్, నెహ్రూ నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీ క్వార్టర్స్ డౌనులో నిర్వహించిన వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. స్పెషలిస్టుల వైద్య బృందం శిబిరంలో పాల్గొన్న ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించింది. పలువురు బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ పథకం ద్వారా సీమంతం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని బీపీ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే సౌభాగ్యమన్న పెద్దల మాటను నిత్యం మననం చేసుకుంటూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మున్సిపల్ ఇంజినీర్ డి.పద్మజ, వాలంటీర్లు పాల్గొన్నారు. కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మేయర్ సుజాత మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్ మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యమని చెప్పారు. బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ పథకం ద్వారా కిట్లు అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, అజయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

చీమకుర్తి: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆర్.ఎల్.పురం సర్పంచ్ పుల్లగూర రమణమ్మ అన్నారు. సోమవారం ఆర్.ఎల్.పురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. 450 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పమిడి ఆంజనేయులు, తిరిపాలు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు, ప్యాడ్స్ షూస్ పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు

మద్దిపాడు: తల్లిదండ్రులు లేని పిల్లలు, వారి నిర్లక్ష్యానికి గురైై ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి కోటిరెడ్డి ఆయన భార్య ఆదిలక్ష్మి పేరున ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా దుస్తులు, షూస్ ప్యాడ్‌లు, జామెంట్రీ, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ అబ్దుల్ అజీమ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేవైజీజేసీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు లక్షల రూపాయలు ఫౌండేషన్ ద్వారా ఖర్చు చేస్తూ చేయూతనివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒంగోలు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీ హెచ్ఎస్ రుద్రవరం, జెడ్పీహెచ్ఎస్ వల్లూరు, మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఆర్అండ్ వీఎస్ఆర్ ఎయిడెడ్ స్కూల్ ఇంకొల్లు నుంచి 110 మంది విద్యార్థులు రాగా వారందరికీ భోజనం ఏర్పాటు చేసి దుస్తులు, ఇతర వస్తువులు అందించారు. తమకు సహాయ సహకారాలు అందించడానికి ముందుకు వచ్చిన ధావని ఫౌండేషన్ యూఎస్ఏ వారికి కోటిరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వారివెంట ఫౌండేషన్ సభ్యులు నరశింహారావు, ఎస్.గోపాల్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో అంశాలు క్షేత్ర స్థాయిలో అమలు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ప్రకాశం భవన్‌లో ఐదు రోజులుగా రైతు శాస్త్రవేత్త కోర్సులో భాగంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని మెంటర్స్, రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి, ఇతర అనుబంధ శాఖల అధికారులు సోమవారం పాల్గొని తగిన సూచనలు ఇచ్చారు. ఈ నెలలో చేసిన పనిపై సమీక్ష నిర్వహించారు. స్వంత పాలం రికార్డ్స్, ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ పరిశీలించారు. ఆరోగ్యం, పోషణ, ప్రకృతి వ్యవసాయం మూల సూత్రాలు, లీడింగ్, మెనేజ్‌మెంట్, లెర్నింగ్ డేటా కమ్యునికేషన్స్ గురించి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారని, నేర్చుకున్న విషయాలను తప్పనిసరిగా అమలు చేసినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని వక్తలు అన్నారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం సుభాషిణి, ఉమా జ్యోతి, శివ కోటేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీఏలో సభ్యులుగా చేరాలి



బీటీఏలో సభ్యత్వం నమోదు చేస్తున్న సంఘ నాయకులు

కొత్తపట్నం: ఉపాధ్యాయులంతా బీటీఏలో సభ్యులుగా చేరాలని ఆ సంఘ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు కోరారు. బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమెదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకపోగా జీపీఎస్ విధానం బలవంతంగా రుద్దటం సమంజసం కాదని, దీన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీటీఏ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులకు పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ లోన్లు మంజూరు చేయటం లేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తిన జాలరామయ్య మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సభ్యత నమోదులో భాగంగా ఈతముక్కల, కొత్తపట్నం, గమళ్లపాలెం ఉన్నత పాఠశాలలు, రాజుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలు వివిధ పాఠశాలలను సందర్శించి పలువురు ఉపాధ్యాయులను బీటీఏలో సభ్యులుగా చేర్చారు. మండల ప్రధాన కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, మండల నాయకులు చెక్కా కోటేశ్వరరావు, సి.విజయ్‌కుమార్, అల్లరి విజయ్‌కుమార్, కర్ర దేవసహాయం పాల్గొన్నారు.

జంగమ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా మల్లికార్జున

ఒంగోలు: జంగమ సంక్షేమ సంఘ నగర అధ్యక్షుడిగా యల్లసిరి మల్లికార్జునను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ముసునూరి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శి–కాకుమాని రవిచంద్ర, కోశాధికారి– చేజర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు– దంపురి సాయిరాం, దొగిపర్తి సురేష్, ఉద్దండం వీరసాయిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు– ఉద్దండం అమర్‌నాథ్, సంయుక్త కార్యదర్శి– త్రోవగుంట సుధాకర్, తోట మల్లికార్జునతో పాటు మరో ఐదుగురిని సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

ఒంగోలు: వాలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వమని ఎయిడెడ్ ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్న చెరుకూరు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు మండలం చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు గణితం, తెలుగు పోస్టుల్లో పని చేస్తున్నారని పేర్కొనఆనరు. వీరిద్దరిని ఆ పాఠశాల యాజమాన్యం వాలంటరీ రిటైర్‌మెంట్ ఇస్తే మీ పోస్టులను తాము భర్తీ చేసుకుంటామని మానసికంగా తీవ్ర ఒత్తిడి చేస్తోందన్నారు. నాలుగు నెలలుగా జీతాల బిల్లుల మీద సంతకం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సురేష్‌కుమార్ చర్యలు చేపట్టాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ నాయకులు స్పృహతో మాట్లాడాలి

ఒంగోలు సెంట్రల్: బీజేపీ నాయకులు పూర్తి విషయాలు అవగాహన కలిగి స్పృహతో మాట్లాడాలని లేబర్ వెల్ఫేర్ బోర్డు మెంబర్, మాదిగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావు అన్నారు. మాదిగ సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డిపై ఇష్టానురీతిగా మాట్లాడటం తగదన్నారు. నాడు చంద్రబాబు ఇచ్చిన బేవరేజ్ లైసెన్స్‌లే తప్ప నూతనంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్క లైసెన్స్ కూడా ఇవ్వని విషయాలను గుర్తు చేసుకోవాలన్నారు. నాడు సొంత తండ్రికి అన్యాయం జరిగిన రోజున పురందేశ్వరి ఎవరి వైపు ఉండి తండ్రికి అన్యాయం చేసిన విషయం రాష్ట్రానికి తెలుసన్నారు. నేడు మళ్లీ అదే చంద్రబాబుకు మేలు చేకూర్చేలా బీజేపీలో ఉండి చంద్రబాబుకు అనుకూలంగా లాబీయింగ్ చేయటం, అధికార పార్టీపై నిందలు వేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే నాణ్యమైన వైద్యం



ఈసీజీని పరిశీలిస్తున్న సురేష్, ఆనంద్‌రావు, సుజాత

కె.పల్లెపాలెం(కొత్తపట్నం): ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తి స్థాయిలో వైద్యం అందుతుందని అడిషనల్ డీఎంఎన్‌హెచ్‌వో సురేష్ అన్నారు. సోమవారంతో ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సురేష్, ఆనంద్‌రావు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కంటి పరీక్షలు, ఈసీజీ, ఓపీ కౌంటర్, మందుల కౌంటర్, రక్త పరీక్ష శిబిరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఏర్పాటు చేసి సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టిందన్నారు. 104 వాహనాలతో నెలకు రెండు సార్లు మీ గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ వైష్ణవి, సీడీపీవో కేవీపీ రాజ్‌కుమారి, కార్యదర్శి మణిదీప్, గ్రామ పెద్దలు పెద్దసింగు వెంకట్రావు, నాంచార్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఒంగోలు సెంట్రల్: మేలైన యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు పొందవచ్చని ఆత్మ పీడీ అన్నపూర్ణ అన్నారు. చీమకుర్తి మండలం పాటిమీదపాలెంలో సోమవారం రైతులకు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. వరి, మిరప పొలాలను పరిశీలించారు. పొలం బడికి ఎంపికైన రైతులకు శిక్షణ ఇచ్చారు. వరిలో సాగు పద్ధతులు, ఆశించి తెగుళ్లు గమనించి నివారణ చర్యలు వివరించారు. మిరపలో తామర పురుగు ఉధృతి ఉన్నట్లు గమనించి జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చెయ్యాలని సూచించారు. పురుగు మందుతో పాటు వేప నూనెను కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయం, సస్య రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. డీఆర్‌సీ వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ, మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్, వీఏఏ శృతి పాల్గొన్నారు.

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను అందచేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్పందన భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. కనిగిరికి చెందిన షేక్ హబిమాలి, ధేనువుకొండకి చెందిన గోపాల సుబ్బారావు, రాజుపాలేనికి చెందిన బలగాని తిరుపతస్వామి, కరవదికి చెందిన జయంతి బుబులకు ఉచితంగా మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు. దీనిలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రిలీఫ్ ఫండ్‌ను వెంటనే విడుదల చెయ్యాలి

ఒంగోలు సెంట్రల్: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు రిలీఫ్ ఫండ్‌ను వెంటనే విడుదల చెయ్యాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ మాదిగ కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి రావాల్సిన రిలీఫ్‌కు వెంటను విడుదల చెయ్యాలని కోరారు. అన్ని జిల్లాల్లో రూ.50 కోట్ల వరకు ఫండ్ రావాల్సి ఉందని గుర్తు చేశారు. దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆంజనేయులు, సాంస్కృతిక విభాగపు నాయకులు అజయ్, రాజారావు, అభిషేక్, శేఖర్, శిఖామణి పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ పాత్ర కీలకం

ఒంగోలు టౌన్: గుండెపోటు వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి చికిత్స కోసం వైద్యశాలకు తరలించే లోపే సీపీఆర్ చేయడంతో ప్రాణాలు కాపాడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ కేశవ చెప్పారు. రెడ్‌క్రాస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, చైర్మన్ ప్రకాష్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని లాయరుపేట సాయి నివాస్ అపార్ట్‌మెంటులో ఇంటింటికీ సీపీఆర్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మణిబాబు మాట్లాడుతూ గుండెపోటు సమయంలో తొలి గంట లోపే తగిన చికిత్స అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. తొలి గంటలోపు చేసే వైద్యంతో 60 శాతానికి పైగా ప్రజల ప్రాణాలు రక్షించబడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారని వివరించారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ఖరీదు చేసే స్టెమీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గ్రామీణ మారుమూల ప్రజలను కాపాడేందుకు 40 వేల రుపాయలకు పైగా ఖరీదు చేసే ఇంజక్షన్లను అందుబాటులో ఉంచనున్నారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో సుమారు వంద మంది వైద్యులు, నర్సులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. మనుషుల ప్రాణాలు కాపాడే లక్ష్యంతో రెడ్‌క్రాస్ సంస్థ ఇంటింటికీ సీపీఆర్‌ను చేపట్టడం అభినందనీయమని ప్రశంసించారు. జీవిత ప్రయాణంలో ఒత్తిడి ఎక్కువయ్యిందని, విద్యార్థుల నుంచి మొదలుకొని ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు ఒత్తిడికి గురవుతున్నారని రెడ్‌క్రాస్ మహిళా విభాగం కన్వీనర్ కోటేశ్వరమ్మ చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో గుండెపోటు సమస్య సాధారణమై పోయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సీపీఆర్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌లో శిక్షణ పొందితే అత్యవసర సమయాల్లో ప్రాణాలు రక్షించగలుగుతారని చెప్పారు. తొలుత డాక్టర్ కేశవ, డాక్టర్ మణిబాబు, ఫస్ట్ ఎయిడ్ శిక్షకులు డాక్టర్ కృష్ణ అపార్ట్‌మెంట్‌లోని 30 మంది సభ్యులకు సీపీఆర్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా విభాగం కో కన్వీనర్ డాక్టర్ మజ్నా బేగం, కార్యదర్శి సుజాత, కోశాధికారి కోసూరి శ్రీదేవి సునీత పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

ఒంగోలు సెంట్రల్: బాలల హక్కుల పరిరక్షణకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలో పలు పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్–1ను సోమవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. పీఎన్‌జీ హైస్కూల్లో బాత్ రూమ్స్ క్లీన్‌గా లేక పోవటం గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నారాయణ హైస్కూల్లో 8,9,10 తరగతుకు అనుమతుల లేకుండా నిర్వహిస్తున్నారని, భగ్యనగర్‌లోని చైతన్య స్కూల్‌ను అనుమతి లేకుండా నడుపుతున్నారని, తగిన సదుపాయాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. డీఆర్‌ఆర్ఎం హైస్కూల్లో విద్యార్థినులతో మాట్లాడగా పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో కొందరు ఆకతాయిలు హాస్టల్‌కు ఎదురుగా ఉన్న గోడలపై కూర్చొని అసభ్యకరంగా వేధిస్తున్నారని తెలిపారు. పోలీసులకు తక్షణమే తెలిపి పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఎంఈఓ కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వాలి



మాట్లాడుతున్న బీజేపీ మీడియా ప్రతినిధి ఉన్నం

ఒంగోలు సెంట్రల్: ప్రజా స్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యం ఉందని, వ్యక్తిగత ద్వేషం, దూషణలతో రాజకీయం చేయడం తగదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా (ప్యానలిస్ట్) ప్రతినిధి ఉన్నం నళిని అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వ్యక్తిగత ద్వేషాలు మనసులో పెట్టుకుని పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై దూషణలకు దిగటం సరికాదన్నారు. పార్టీ అధికార ప్రతినిధులు బొద్దులూరి ఆంజనేయులు, ఎనుముల నాగేశ్వరరావు, జాడి వెంకట నారాయణ, జిల్లా మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము నాయుడు, జిల్లా కార్యదర్శి బసినేపల్లి రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కుంచాల వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్య నియంత్రణకు సహకరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: వాతావరణ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్తలు అన్నారు. లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 316 హెచ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో ఈ–వేస్ట్ క్యాంపైనింగ్ అండ్ కలెక్షన్‌ను లయన్స్ ఇంటర్నేషనల్ 316 మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్, జిల్లా గవర్నర్ ఎం. కృపానందం ప్రారంభించారు. దేశంలో ఈ–వేస్ట్ వాతారణ కాలుష్యానికి ఒక కారణం అవుతుందన్నారు. వేస్ట్‌ను సేకరించి రీ సైక్లింగ్‌కు పంపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఒంగోలు లయన్స్ క్లబ్, సిటిజన్స్ క్లబ్, కలాం ప్రకాశం క్లబ్, విజన్ లయన్స్ క్లబ్, చీరాల, కంభం, దర్శి, గుంటూరు, బాపట్ల క్లబ్‌ల వారు పాల్గొని ఈ–వేస్ట్ పోస్టర్స్, బ్యానర్స్ ఆవిష్కరింపచేశారు. అన్ని క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ–వేస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించి పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ–వ్యర్థ జిల్లా కో ఆర్డినేటర్ రామకృష్ణ, రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాశ్‌బాబు, 316జి గవర్నర్ మాణిక్యాలరావు, ఒంగోలు సిటిజన్స్ ప్రెసిడెంట్ శ్రీకాములు రెడ్డి, సెక్రటరి నోబెల్ చరియాన్, సోమినేని సురేష్, జిల్లా క్యాబినెట్ మెంబర్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే పంగులూరు: ఖోఖో పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పంగులూరుకు మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఐదు రోజులుగా బాపట్ల జిల్లా మండల కేంద్రం జే పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 37వ రాష్ట్రస్థాయి ఖోఖో శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరాన్ని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాప్ వారు అందజేసిన క్రీడా దుస్తులను చైతన్య క్రీడాకారులకు అందజేశారు. ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ మేకల సీతారామిరెడ్డి మాట్లాడుతూ క్యాంపునకు సహకరించిన శాప్ వివిధ జిల్లాల సెక్రటరీలకు, గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ (శాప్) వీసీ అండ్ ఎండీ ధ్యాన్‌చంద్ ఐఏఎస్ ఆర్థిక సహాయంతో నిర్వహించారు. శిబిరం పర్యవేక్షకుడిగా కోచ్ డీ లక్ష్మీనారాయణ రెడ్డి, అసిస్టెంట్ కోచ్ బ్రహ్మానాయుడు, మెంటార్, సహాయక సిబ్బంది, అంతర్జాతీయ క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ కే హనుమంతరావు వ్యవహరించారు.

గోవాలో ఆడే ఆంధ్రా జట్టు ఎంపిక..

జాతీయ స్థాయిలో ఆంధ్రా తరపున గోవాలో ఖోఖో పోటీల్లో పాల్గొననున్న జట్టును కోచ్‌లు సోమవారం ఎంపిక చేశారు. వారిలో వై సతీశ్, పీ శివారెడ్డి, కే వంశీ (ప్రకాశం), పీ నరసయ్య (విజయనగరం), ఎం ఫణికుమార్ (ప్రకాశం), ఏ శివ నాగిరెడ్డి (భారతీయ రైల్వే), జీ క్రాంతికుమార్ (విశాఖపట్నం), పీ స్వామినాథన్ (భారతీయ రైల్వే), బీ లక్ష్మీనారాయణ (నెల్లూరు జిల్లా), కే రామ్మోహన్ (ప్రకాశం), ఏ రాజ్ కుమార్ (చిత్తూరు జిల్లా), వై దాల్‌నాయుడు (కృష్ణా జిల్లా), ఎల్ అప్పలనాయుడు (పశ్చిమ గోదావరి), కే ప్రవీణ్ (శ్రీకాకుళం)ను ఎంపిక చేశారు.